క్లుప్తంగా

వైభవంగా వీరచిన్నయ్య స్వామి జాతర



అలంకరణలో వీరచిన్నయ్య స్వామి

రొద్దం: మండలంలోని నారనాగేపల్లిలో వీరచిన్నయ్యస్వామి జాతర గురువారం వైభవంగా నిర్వహించారు. ఏటా ఆషాఢమాసంలో తొలి ఏకాదశ రోజున వీరచిన్నయ్య స్వామి జాతర నిర్వహించడం ఆనవాయితీ. అర్చనలు, అభిషేకాలు, ఆకుపూజతో ప్రత్యేక పూజల అనంతరం మహిళలు స్వామికి జ్యోతులతో ప్రదర్శనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రైతులు ఎద్దుల బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. రాత్రి గ్రామంలో వీరచన్నయ్యస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగించారు. అలాగే తురకలాపట్నం బైలు ఆంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవం నిర్వహించారు.

తగ్గేదే లే...



ఫ్రీ బస్సుల కోసం ఎదురు చూస్తున్న మహిళలు

పావగడ: ఎవరు తగ్గినా తాము తగ్గేదే లే అన్న తీరు తో స్థానిక మున్సిపల్ బస్టాండు ప్లాట్ ఫాం లో కేఎస్ఆర్టీసీ ఫ్రీ బస్సుల కోసం అధిక సంఖ్యలో మహిళా ప్రయాణికులు ఎదురు చూస్తున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. చిత్రదుర్గం, దావణగెరె, శివమొగ్గ ప్రాంతాలకు వెళ్లే బస్సుల ప్లాట్ ఫాం సీట్ల ను పూర్తిగా స్వాధీనం చేసుకుని మహిళలు కూర్చోవడం గమనార్హం. అనంతరం చిత్రదుర్గం వైపు వెళ్లే బస్సు రావడంతో పరుగున వెళ్లి సీట్ల కోసం తోసుకుంటూ బస్సు ఎక్కారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు న్యాయం



సర్వేలో పాల్గొన్న ఎంపీటీసీ లక్ష్మమ్మ

రొళ్ల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులకు న్యాయం జరుగుతుందని ఎంపీటీసీ లక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు యర్రగుంటప్ప పేర్కొన్నారు. గురువారం కాకి గ్రామంలో వారు లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. గ్రామాల్లో ఉండి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందరు. ప్రజలు తమ సమస్యలను ఏమైన ఉంటే అధికారుల దృష్టికి తీసువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

మోస్తరు వర్షం

మడకశిరరూరల్: మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురవడంతో వాతావారణం చల్లబడింది. వర్షం కురవడంతో ఖరీఫ్ పంట సాగు చేసుకోవడానికి, భూములను దున్ని దుక్కి చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపతుందని రైతులు తెలిపారు.

నేడు భూతప్ప ఉత్సవాలు

మడకశిరరూరల్: తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా మండల పరిధిలోని భక్తరహళ్ళి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు మిని భూతప్ప ఉత్సవాలు నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, సంతానం లేని మహిళలు ఉత్సవంలో పాల్గొంటారని, వారు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

ఏకలవ్య స్ఫూర్తితో ముందుకు సాగాలి



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఏకలవ్యుడి స్ఫూర్తితో ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం ఏకలవ్య జయంతిని స్థానిక ఎల్లమ్మాంబ ఆలయం వద్ద ఎరుకుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ రెడ్డి రమణమ్మ, ఎంఈఓ గంగప్ప, డాక్టర్ శ్రీనివాసులతో పాటు సీఐ మన్సూరుద్దీన్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ద్రోణాచార్యుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శంకరయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు నంజప్ప, ఎరుకల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేష్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు మలోజ్, హనుమంతప్ప, కొత్తపల్లి హనుమంతరాయప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, పార్లమెంట్ అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు



పెనుకొండ: ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



పెనుకొండ: బక్రీద్ వేడుకల్లో ముస్లింలు



గుట్టూరులో ప్రదర్శనగా వెళ్తున్న ముస్లింలు



రొద్దం: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

హిందూపురం, పెనుకొండ, మడకశిర సాక్షి బృందం: త్యాగానికి ప్రతీకయైన బక్రీద్ పండుగను ముస్లింలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఈద్గా మైదానాల్లో ముస్లింలు ప్రార్థనలు చేపట్టారు. మతపెద్దలు ప్రసంగిస్తూ కుమారుడు ప్రవక్త ఇస్మాయిల్ అలైహి అస్సాలంను దైవాజ్ఞ ప్రకారం దైవానికి సమర్పించడానికి సిద్ధమై త్యాగానికి ప్రతీకగా నిలిచినట్లు ప్రతిముస్లిం త్యాగ నిరతిని కల్గి ఉండాలన్నారు. పండుగ రోజునే కాకుండా నిత్యం చేసిన ప్రార్థనలు, దానాలు, త్యాగాలు దైవకృపకు చేరువ చేస్తాయన్నారు. అనంతరం సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేసి ముస్లింలు, ప్రముఖులు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పెనుకొండలో ముస్లింలకు ఎమ్మెల్యే శంకరనారాయణ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



గోరంట్ల: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సోమందేపల్లి : ప్రార్థనలకు వెళ్తున్న ముస్లింలు



లేపాక్షి: ప్రార్థనా స్థలానికి వెళ్తున్న ముస్లింలు



పరిగి: ఈద్గా మైదానంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



హిందూపురం: నమాజ్ చేస్తున్న ముస్లింలు



అమరాపురం ఈద్గా మైదానంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



రొళ్ల: ఆర్.వద్రహట్టి క్రాస్ ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పావగడ : ఈద్గా మైదానంలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న జామియా మసీదు కమిటీ సభ్యులు

'జగనన్న సురక్ష'పై సర్వే



రొద్దం: మరువపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



గోరంట్ల: కమ్మవారిపల్లి సచివాలయంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శివారెడ్డి

రొద్దం: రొద్దం పంచాయతీ పరిధిలోని ఆర్.మరువపల్లి గ్రామంలో గురువారం ఉదయం జగనన్న సురక్షపై అధికారులు సర్వే చేట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అర్హత ఉండి పథకాలు అందని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ రూప, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్పీ రవిశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని చౌండూరివాండ్లపల్లి , కమ్మవారిపల్లిలో గురువారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సర్వే నిర్వహించారు. పెనుకొండ డీఎల్‌డీఓ శివారెడ్డి, ఎంపీడీఓ రఘునాథగుప్త సర్వేను పరిశీలించారు. అనంతరం కమ్మవారిపల్లి సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లతో డీఎల్‌డీఓ సమావేశం ఏర్పాటు చేసి 'జగనన్న సురక్ష' విజయవంతం చేయాలని సూచించారు.

వావ్.. వానర 'యోగ'ం



యోగాలో ఆసనాలు వేస్తున్న వానరం



యోగా చేస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని గురువులు చెప్తారు.. చాలా మంది యోగా శిక్షణ తీసుకొని మరికొంత మందికి నేర్పుతున్నారు. ప్రస్తుత కాలంలో యోగా ప్రతి ఒక్కరికీ భాగమైంది. ఇటీవల అంతర్జాయతీ యోగా దినోత్సవం కూడా జరిగింది. అప్పట్లో మనుషులు యోగా చేయడం, ఆసనాలు వేయడం చూసిదో ఏమో ఈ వానరం.. అటు ఇటూ వెళ్లేవారిని ఆకర్షించింది. గురువారం ఉదయం ఆర్‌పీజీటీ రోడ్డులోని ఓ ఇంటిపైన వానరం ఇలా పడుకొని కాళ్లు, చేతులు ఆడిస్తూ యోగాసనాలు వేసింది. చూసిన వారు సైతం వావ్..వానరం భలే యోగాసనాలు వేస్తోందే అని నవ్వుతూ వెళ్లడం కనిపించింది.

– హిందూపురం టౌన్:

కాల్పులు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

రొళ్ల: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సహరాన్‌పూర్‌లో ఓ కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్న భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పులు జరిపిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజినేయులు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దాడి చేసిన వ్యక్తులు హర్యానా రవాణాశాఖ సంబంధించిన నంబర్ ప్లేటుతో కూడిన కారులో వచ్చి కాల్పులు జరిపారని పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్‌కు జెడ్‌ప్లస్ కేటగిరీ రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జూదరుల అరెస్ట్

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని మంగాపురం గ్రామ శివారులో గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.721 నగదును స్వాధీనం చేసుకున్నారు.నిందితులతో పాటు తప్పించుకు పారిపోయిన మరో ముగ్గురిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

హిందూపురం టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ నాయకులు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం పట్టణంలోని 9, 10 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి మోదీ 9 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను అందించారు. మోదీకి మద్దతుగా సెల్: 9090902024కు కాల్ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పార్థసారధి, వెంకట శివ, నగేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి స్వచ్ఛంగా ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రక్తనిధి కేంద్రంలో ఆలిండియా ఫ్రీడమ్ ఫైటర్ టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘం అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్ ఆధ్వర్యంలో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని రక్తదానం చేశారు. అఖిలపక్షం నాయకులు బాలాజీ మనోహర్, సీఐలు ఈరన్న, మన్సూరుద్దీన్, ఆర్ఎంఓ రుక్మిణమ్మ, డాక్టర్ ప్రశాంత్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నర్స్ చంద్రకళ, నాయకులు అమానుల్లా, ఉసామా ఖాన్, రమేష్, పల్వందర సింగ్, శ్రీకాంత్ శర్మ, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ జీవితాలను చూపిన దార్శనికుడు

రాప్తాడురూరల్: నీలం రమేష్‌రెడ్డి అధ్యాపకుడిగా విద్యార్థుల్లో నిరంతర స్ఫూర్తిని నింపారని, ఆదర్శ జీవితాలను చూపిన దార్శనికుడని వక్తలు కొనియాడారు. ఆర్ట్స్ కళాశాలలో రాజనీతి శాస్త్ర లెక్చరర్, పెనుకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి అకాల మరణం పొందిన నీలం రమేష్ రెడ్డిని స్మరించుకుంటూ పూర్వ విద్యార్థులు గురువారం ఆర్ట్స్ కాలేజీ డ్రామా హాల్‌లో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి సభకు అధ్యక్షత వహించగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రమేష్‌రెడ్డి ఒక ఆదర్శప్రాయమైన జీవితాన్ని విద్యార్థులకు చూపించారని తెలిపారు. రేపటి భవిష్యత్తును దర్శించే ఒక సుగుణాన్ని నేర్పారన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ రంగస్వామి మాట్లాడుతూ విద్యార్థుల హృదయాల్లో ఇంత గొప్ప స్థానాన్ని సంపాదించుకున్న లెక్చరర్‌ను తన మిత్రుడు అని చెప్పుకోవడం గర్వంగా ఉందన్నారు. డిగ్రీ అధ్యాపకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలపై చేయాల్సిన పోరాటాలకు మార్గ మార్గదర్శకత్వం వహించారన్నారు. వెనకుండి మమ్మల్ని నడిపారని గుర్తు చేశారు. రమేష్‌రెడ్డి సతీమణి మాధవి మాట్లాడుతూ విద్యార్థులకు ఎంత స్ఫూర్తిగా నిలిచారో , భార్యగా, స్త్రీగా నాకూ అంతే మార్గదర్శకత్వం వహించారన్నారు. స్త్రీలను కూడా పురుషులతో సమానంగా గౌరవించే విశిష్ట లక్షణాన్ని రమేష్ రెడ్డిలో చూశామన్నారు. పూర్వ విద్యార్థులు రాధాకృష్ణ, యమునా మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాళ్లు మురళీధర్, జనార్దన్ రెడ్డి, వెంకట శివారెడ్డి, అధ్యాపకులు రామకృష్ణారెడ్డి, జయప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రొప్పం గ్రామం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రొద్దం గ్రామానికి చెందిన బడికి నాగరాజు కుమారుడు నటరాజ్ అనే వ్యక్తి తీవ్ర గాయాలయ్యాడు. వివరాలు..రొద్దం నటరాజ్ స్కూటీపై పావగడకు వస్తుండగా రొప్పం వద్ద ఓ గేదె అడ్డురావడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో గేదె మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన నటరాజ్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. కాగా అతని వెంట వెళ్తున్న మురళి అనే స్నేహితుడికి ఎలాంటి ప్రమాదం సంభవించక పోగా అతడు పరారైనట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకదశి పూజలు



గోరంట్ల: జ్యోతుల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం



మడకశిరరూరల్: గౌడనహళ్లిలో మహిళలు జ్యోతుల ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



పెనుకొండ: పూజలు చేస్తున్న రామకృష్ణస్వామి



హిందూపురం: అలంకరణలో పేట వెంకటరమణస్వామి

హిందూపురం,పెనుకొండ, మడకశిర సాక్షి బృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిరం నియజకవర్గాల్లోని ఆలయాల్లో గురువారం తొలిఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. హిందూపురంలోని పేట వెంకటరమణ ఆలయంలో వెంకటరమణస్వామిని శ్రీలక్ష్మి సమేత పాండురంగస్వామిగా అలంకరించారు. పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి అలంకరించారు. నింకంపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆర్‌పీజీటీ రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, మున్సిపల్ ఆఫీసు సమీపంలోని వెంకటరమణస్వామి ఆలయం, రైల్వేరోడ్డులోని షిర్డిసాయి బాబా ఆలయం, సత్యనారాయణపేట సాయి సంస్థాన్ ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, పూజలు జరిగాయి. అలాగే పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



హిందూపురం: నింకంపల్లి లక్ష్మీనరసింహస్వామి



లేపాక్షి: అలంకరణలో కపిలేశ్వరస్వామి



పెనుకొండ రూరల్: జ్యోతులను మోస్తున్న మహిళలు



మడకశిర రూరల్: నీలకంఠాపురంలో లక్ష్మీనరసింహస్వామి ఊరేగిస్తున్న దృశ్యం



హిందూపురం: పేట వెంకటరమణస్వామి ఆలయంలో సంకీర్తనలు చేస్తున్న మహిళలు



అమరాపురం: లక్ష్మీనరసింహస్వామి ఉత్సవం విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



లేపాక్షి: పన్నేరపు బండ్ల ఊరేగింపు

గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు



వేడుకల నిర్వహణపై సమావేశమైన పట్టణ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు

మడకశిర: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో జూలై 2 నుంచి గురుపౌర్ణమి వేడుకలను భారీగా నిర్వహించనున్నట్లు స్థానిక మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వేడుకల నిర్వహణపై గురువారం రాత్రి పట్టణ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో సమావేశమై చర్చించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యే అవకాశం ఉందని, ఈనేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

బాలిరెడ్డిపల్లి లక్ష్మీనరసింహస్వామికి పూజలు

హిందూపురం: ముద్దిరెడ్డిపల్లి సమపంలో బాలిరెడ్డి పల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఉట్ల పరుష సందర్భంగా 30 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. లక్ష్మీనరసింహస్వామికి పంచామృతాభిషేకాలు విశేష అలంకరణలతో పూజలు నిర్వహించారు. హిందూపురం, పరిగి మండలాల నుంచే కాకుండా పరిసర మండలం నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి పూజలు నిర్వహించారు.